క్లుప్తంగా

ప్రవేశ పరీక్షకు 74 మంది హాజరు



ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఉయ్యాలవాడ : మోడల్‌స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం స్థానిక మోడల్ స్కూల్‌లో జరిగిన రాత పరీక్షకు 74 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష కోసం 88 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా పరీక్షకు 74 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థినికి మెమొంటో, నగదు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): కర్నూలు ఉమ్మడి జిల్లాలోని పది, ఇంటర్మీడియెట్‌లో అత్యంత ప్రతిభ చూపిన పద్మశాలీయ విద్యార్థులకు పద్మశాలీయ జిల్లా అధ్యక్షుడు భీమునిపల్లె వెంకటసుబ్బయ్య, నగదు, మెమొంటోలు అందజేశారు. స్థానిక భద్రావతి భవనారాయణస్వామి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆరుగురు విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.7,500, తృతీయ బహుమతి రూ.5వేల నగదుతో పాటు మెమొంటో అందజేశారు. అలాగే 61మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతిగా ఒక్కొక్కరికి రూ.2వేలు నగదు, మెమొంటో అందజేశారు. ప్రధాన కార్యదర్శి గాజుల శంకర్, అఖిల భారత పద్మశాలీయ సంఘం ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, పబ్బుతులసీ కృష్ణ, కౌన్సిలర్లు పున్నారాజేశ్వరి, పురంధర్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు నేరుగా జీతాలు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): ఏపీ విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి నేరుగా జీతాలు ఇవ్వాలని సంఘం జి.3045 కర్నూలు జిల్లా అధ్యక్షుడు శరత్‌కుమార్ కోరారు. స్థానిక క్రాంతినగర్ కార్యాలయంలో ఆదివారం సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెగ్యులరైజేషన్‌కు సంబంధించి విద్యుత్ యాజమాన్యం తరపున కేబినెట్ సబ్ కమిటీకి ప్రపోజల్ పంపాలని కోరారు. సంఘం రాష్ట్ర నాయకుడు మధు మాట్లాడుతూ 2022 పీఆర్సీతో కలిపి డీఏ, ఇంక్రిమెంట్లతో కూడిన వేతనాలు చెల్లించాలని, ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం, రూ.20లక్షలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు గోపాల్, మద్దయ్య, రామకృష్ణ, మోహన్, హుసేన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు మందుల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం, లయన్స్‌క్లబ్ సహకారంతో ఆదివారం దివ్యాంగులకు నెలకు అవసరమైన మందులను సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అందజేశారు. ఆయన మాట్లాడుతూ 20మంది దివ్యాంగులకు రూ.10వేలు విలువ చేసే నెలవారి మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. క్లబ్ ప్రాంతీయ చైర్మన్ కొట్టి చంద్రశేఖర్, కూరప్రసాద్, రత్నకుమార్, సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అరటి రైతులను ఆదుకోవాలి

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల గాలివానకు నష్టపోయిన మహానంది మండల అరటి రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తూముశివారెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తిమ్మాపురం, మహానంది, గాజులపల్లె, అబ్బీపురం, గోపవరం గ్రామాల్లో గాలి వానకు పంట నేలపాలైందన్నారు. అధికారులు సర్వే చేయించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

చాగలమర్రి: మండల కేంద్రానికి చెందిన వీఆర్‌ఏ పెద్ద దస్తగిరి (56) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వీఆర్‌ఓలు శ్రీనివాసులు, మదన్, విశ్వనాథ్, వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ గఫార్ పెద్ద దస్తగిరి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం అందజేసిన రూ.25,000 నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.

మహానందిలో సండే సందడి

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా రుద్ర, బ్రహ్మ, విష్ణు గుండం కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు.

గ్రామీణాభివృద్ధి భేష్

- పథకాలను ప్రజలకు చేర్చడంలో డీఆర్‌డీఏ సఫలం
- ప్రతినెల తంచన్‌గా పింఛన్ల పంపిణీ
- జిల్లాలో 2,14,938 మంది పింఛన్‌దారులు
- వైఎస్సార్ బీమా నమోదులో ఆ శాఖ కీలకం
- జిల్లాలో ఇప్పటికే 1,261 రిజిస్ట్రేషన్లు పూర్తి
- 1,089 మందికి రూ.10.28 కోట్ల బీమా సొమ్ము అందజేత



డీఆర్‌డీఏ కార్యాలయం

నంద్యాల(రూరల్): సంక్షేమ పథకాలను సమర్థవంతంగా లబ్ధిదారులకు అందజేయడంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులు సఫలమయ్యారు. ముందుగానే కొత్త జిల్లా.. వనరులు పూర్తిస్థాయిలో ఉండకపోవడం, యంత్రాంగం జిల్లా స్థాయి వ్యవహారాలకు సర్దుబాటు కావడం కొద్ది రోజులు ఇబ్బందులే.. అయినా జిల్లా అధికారులు, సిబ్బంది నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఎక్కడా తడబాటు లేకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పథకాల అమలులో లోపాలను సరిచేసుకొని సక్రమంగా అమలు చేస్తున్నారు. అలాగే.. పథకాల తీరును ప్రజలకు అవగాహన కల్పించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా అందజేస్తూ అభివృద్ధికి తమ శాఖను చిరునామాగా మార్చారు. కొత్త జిల్లా ఏర్పాటుతో పరిధి తక్కువగా ఉండటంతో ఏ మారుమూల గ్రామానికైనా ఉన్నాతాధికారులు వేగంగా వెళ్లేందుకు వీలు ఏర్పడింది. ఫలితంగా ప్రభుత్వ పథకాలు అర్హులకు సకాలంలో అందుతున్నాయి..

తంచన్‌గా పింఛన్..

జిల్లా వ్యాప్తంగా 2,14,938 పింఛన్‌దారులు ఉన్నారు. వీరందరికీ ప్రతి నెల రూ.59,32,11,750 ను ప్రతి నెల 1 నుంచి 5వ తేదీ లోపు అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పాత్ర ప్రముఖమైనది. వలంటీర్లు, గ్రామ, మండల స్థాయి అధికారుల సమన్వయంతో పింఛన్ల ప్రక్రియను పకడ్బందీగా ప్రతినెలా విజయవంతంగా ముగిస్తున్నారు.

వైఎస్సార్ చేయూత..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల (45 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వయస్సు) జీవనోపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.18,750 ప్రకారం 4 సంవత్సరాలకు రూ.75,000 వారి ఖాతాల్లో నేరుగా జమచేస్తుంది. వీటితో పాటు ఈ పథకంలో భాగంగా అర్హత కలిగిన వారికి కిరాణా షాపులు, గేదేలు, ఆవులు, మేకల యూనిట్లు కూడా ఏర్పాటు చేయిస్తుంది. ఈ పథకాన్ని ప్రజలలోకి తీసుకెళ్లి సఫలం చేయడంలో ఈ శాఖ ప్రశంసలు పొందింది. ఈ పథకానికి జిల్లాలో 9,489 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం కేటాయించిన రూ.178.10 కోట్లను సకాలంలో మంజూరు చేస్తున్నారు.

కల్యాణమస్తు..షాదీ తోఫా..

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన అమ్మాయిల వివాహానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఉచితంగా అందిస్తుంది. ఈ పథకానికి సంభంధించి 890 దరఖాస్తులు అందగా, వాటిలో 691 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చి రూ.10.21 కోట్లను అమ్మాయిల ఖాతాల్లో జమ చేశారు. దీంతో చాలా మంది కొత్తగా పెళ్లి చేసుకున్న మహిళలు రాష్ట్ర ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. అలాగే స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 31,395 మందికి స్త్రీ నిధి పథకం ద్వారా రూ.147.38 కోట్లు ప్రభుత్వం అందించింది. ఇందులోనూ ఈ శాఖ సేవలు అభినందనీయం.

బీమాతో ధీమా..

వైఎస్సార్ బీమా కోసం జిల్లాలో 1,261 మంది దరఖాస్తు చేసుకోగా, వాటిలో 1,089 మందికి రూ.10.28 కోట్లు బీమా సొమ్ము అందజేశారు. సాధారణ మరణాలకు సంబంధించి 138 మంది వివరాలు నమోదు కాగా, 79 మందికి పరిహారం పంపిణీ వంద శాతం పూర్తి చేసింది. మొత్తం రూ.3.95 కోట్లను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టాలలో ఉన్న కుటుంబాలను వైఎస్సార్ బీమా పేరుతో ఆదుకుంటుండటంతో ఆయా కుటుంబాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అభినందనలు తెలియజేస్తున్నారు. బీమా దరఖాస్తు మొదలు నుంచి సొమ్ము అందించేంత వరకు డీఆర్‌డీఏ కృషి ఎనలేనిది.

బాసటగా జగనన్న తోడు..

జగనన్న తోడు పథకం మహిళల అభివృద్ధికి బాసటగా నిలుస్తుంది. ఈ పథకానికి జిల్లా వ్యాప్తంగా 9,639 మంది అర్హులుండగా వీరి కోసం రూ.1.078 కోట్లు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా 21,001 స్వయం సహాయక సంఘాల్లోని మొత్తం 2,10,106 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం కింది రూ.136.10కోట్లు అందజేశారు.

'ఉన్నతి'తో ఔన్నత్యం..

రాష్ట్రంలో అమలవుతున్న ఉన్నతి పథకం ద్వారా జిల్లాలో 675 స్వయం సహాయక సంఘాలు లబ్ధి పొందాయి. ఆయా గ్రూపుల్లో మొత్తం 2,347 మంది సభ్యులకు రూ.14.39 కోట్లు లబ్ధి చేకూరింది. ఈ పథకంలో భాగంగానే పాడుపు మహిళలకు 8వేల బర్రెలు, 2,300 ముర్రా గేదెలను పంపిణీ చేశారు.అలాగే మహిళల ఆర్థికాభివృద్ధి కోసం జిల్లాలోని బేతంచెర్ల పట్టణంలో మహిళా మార్ట్‌ను పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించారు.

పథకాలు సకాలంలో అందజేస్తున్నాం



సంక్షేమ పథకాల సొమ్మును సకాలంలో లబ్ధిదారులకు అందేలా చూస్తున్నాం. వంద శాతం లక్ష్యం పూర్తి చేశాం. ఎక్కడా జాప్యం లేకుండా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, హర్ ఘర్ తిరంగ్, చేయూత మహిళా మార్ట్, జాతీయ లింగ వివక్షత, అనీమియా, పోషణ్ అభియాన్, పోషణ్ పక్వాడా తదితర కార్యాక్రమాలపై కూడా గ్రామీణులకు అవగాహన కల్పించాం.

– శ్రీధర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

పథకాలు, లబ్ధిదారులు, చేకూరిన లబ్ధి వివరాలు..

- జిల్లాలో మొత్తం పింఛన్‌దారులు **2,14,938** మంది
- ప్రతి నెల వారికి అందే పింఛన్ మొత్తం రూ. **59,32,11,750**
- జిల్లాలో వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు : **9,489** మంది
- వైఎస్సార్ చేయూత కింద కేటాయించిన మొత్తం రూ.**178.10** కోట్లు
- కల్యాణమస్తు, షాదీ తోఫా లబ్ధిదారుల సంఖ్య : **691** మంది
- కల్యాణమస్తు, షాదీ తోఫా కింద అందజేసిన సొమ్ము : రూ.**10.21** కోట్లు
- స్వయం సహాయక సంఘాల సభ్యులు : **31,395** మంది
- సంఘాల్లోని మహిళలకు అందజేసిన స్త్రీనిధి సొమ్ము : రూ.**147.38**కోట్లు
- వైఎస్సార్ బీమా లబ్ధిదారుల సంఖ్య : **1,089**
- బీమా పొందిన మొత్తం : రూ.**10.28** కోట్లు
- సాధారణ మరణాల సంఖ్య :**138**
- అందజేసిన మొత్తం రూ.**3.95**కోట్లు
- జగనన్న తోడు అర్హులు : **9,639** మంది
- వీరి కోసం రూ.**1.078** కోట్లు అందజేశారు.
- స్వయం సహాయక సంఘాల సభ్యుల సంఖ్య : **21,001**
- వీరికి వైఎస్సార్ ఆసరా పథకం కింద అందజేసిన మొత్తం : రూ.**136.10** కోట్లు
- **675** స్వయం సహాయక సంఘాల్లోని **2,347** మంది సభ్యులకు అందిన ఉన్నతి పథకం లబ్ధి రూ. రూ.**14.39** కోట్లు
- పాడుపు మహిళలకు **8**వేల బర్రెలు. **2,300** ముర్రా గేదెల పంపిణీ

ఆధ్యాత్మికం

వేడుకగా ఆలయాల వార్షికోత్సవం



గంగాభవానీకి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో శ్రీ కృష్ణుడు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక చిత్తలూరి వీధిలో వెలసిన శ్రీకృష్ణ భజనమందిరం, కుందూనది ఒడ్డున వెలసిన శ్రీ గంగాభవానీ ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వాహకులు ఆదివారం వేడుకగా నిర్వహించారు. శ్రీకృష్ణ భజన మందిరంలో స్వామి వారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ, తదితర పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరించారు. అనంతరం స్వామి వారికి సామూహిక తులసీ అర్చన, శ్రీవిష్ణు సహస్ర పారాయణం జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు సుధీంద్రాచార్యులు, తదితరులు పాల్గొన్నారు. గంగాభవానీ ఆలయ 14వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించారు. తదనంతరం సామూహిక కుంకుమార్చన చేపట్టారు.

పుట్టాలమ్మకు ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ: మండలంలోని ఆర్.కృష్ణాపురం రామతీర్థంలో వెలసిన పుట్టాలమ్మ వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి వారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో క్షేత్ర పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు పుట్టాలమ్మ, శ్రీలక్ష్మీనరసింహస్వామి, పార్వతీదేవి, శ్రీవల్లిదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వాములను దర్శించుకుని పూజలు చేపట్టారు. కొందరు పూలు, పండ్లు. చీరలను పుట్టాలమ్మకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తి శ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులు పూజల్లో పాల్గొని నైవేద్యంగా పిండి వంటలు సమర్పించారు. మరికొందరు చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సంగమేశ్వరుడిని దర్శించుకున్న ఎన్నికల అధికారి



వేపదారు శివలింగానికి పూజలు చేస్తున్న ఎన్నికల అధికారి

కొత్తపల్లి: సప్తనది సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరాలయాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారి (అడిషనల్ సీఈఓ) వెంకటేశ్వరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆలయ సంప్రదాయానుసారంగా వారికి స్వాగతం పలికారు. ఆలయ చరిత్రను ఆయనకు వివరించారు. అనంతరం సంగమేశ్వరాలయంలోని వేపదారు శివలింగానికి నదీజలాలతో అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, రుద్రాభిషేకం, మంగళహారతి వంటి విశేష పూజకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాలను, కృష్ణానదితీర ప్రాంతాన్ని సందర్శించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ...



న్యాయమూర్తికి స్వామి వారి చిత్రపటాన్ని అందిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరుడు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి ప్రభాకరశర్మ, ఉష దంపతులు ఆదివారం పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, వేద పండితులు రవిశంకర అవధాని స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు, మెమొంటో అందించి సన్మానించారు. వారి వెంట డీటీ కామేశ్వరరెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమాచారం

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

సమాచారం

నేడు తుడుమలదిన్నెలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్

ఉయ్యాలవాడ : మండలంలోని తుడుమలదిన్నె గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ శిబిరం నిర్వహిస్తామని వైద్యాధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి వైద్య బృందం 104 వాహనంలో ఉదయం 9 గంటలకు చేరుకుని సాయంత్రం 4 గంటల వరకు అక్కడే ఉండి ప్రజలకు వైద్య సేవలు అందజేస్తామని చెప్పారు.

హెచ్‌ఎంగా శ్రీనివాసులు

దొర్నిపాడు: స్థానిక ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా శ్రీనివాసులు బదిలీపై రానున్నారు. ఈయన రుద్రవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతి పొంది ఇక్కడికి రానున్నారు. ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేస్తున్న మహమ్మద్ హుసేన్ దేవనకొండ మండలం కరివేములలోని జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంగా బదిలీపై వెళ్లారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు.

నేడు వలంటీర్లకు సన్మానం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

సేవాగుణం కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీ పోచా

శిరివెళ్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి,గుండెజబ్బుల శిబిరాన్ని ఎంపీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్యం ఖరీదైన ఈ రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉచిత వైద్యశిబిరాల ఏర్పాటు ఎంతో మేలు చేస్తాయన్నారు. శిబిరం ఏర్పాటుపై నిర్వాహకులను అభినందించారు. శాంతిరాం సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు ప్రత్యూష, సింధూ 305 మందికి కంటి పరీక్షలు చేసి 75 మందికి కంటి అద్దాలు, 85 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మరో 105 మందికి కంటి సమస్యలు ఉండడంతో వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే 25 మంది గుండె జబ్బులతో బాధ పడుతున్న గుర్తించారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు కండె ఆనంద్, శ్యాంసుందర్‌లాల్ పాల్గొన్నారు.

కోలుకోలేక వృద్ధుడి మృతి

దొర్నిపాడు: మండలంలోని ఉమాపతినగరం గ్రామానికి చెందిన క్రిష్టయ్య (58) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఏఎస్ఐ రంగయ్య తెలిపిన మేరకు వివరాలు.. క్రిష్టయ్య మద్యానికి బానిస కావడంతో పాటు ఆరోగ్యం సరిగ్గా ఉండటం లేదు. తరచుగా కడుపు నొప్పి వస్తుండంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 8న కల్లాపు చల్లే రంగులో నీళ్లు కలుపుకొని సేవించాడు. గమనించిన భార్య క్రిష్టమ్మ నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు చెప్పారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఆదివారం డ్యా అధికారులు తెలిపారు. కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

ఫోన్ కొట్టు.. పరిష్కారం పట్టు

- విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే ఫోన్‌లో సమాచారమివ్వండి
- నాణ్యమైన సేవలందించడమే లక్ష్యం
- విద్యుత్ శాఖ ఈఈ రమణారెడ్డి

నంద్యాల(అర్బన్): వర్షాకాలం ప్రారంభమవడంతో ఈదురు గాలులు, వర్షంతో విద్యుత్ అంతరాయం చోటుచేసుకునే అవకాశాలు ఎక్కువ. అయితే ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో ప్రజలకు ఇబ్బందులుంటే ఒక్క ఫోన్ కాల్‌తో సమస్యకు పరిష్కారం చూపుతామని విద్యుత్ శాఖ నంద్యాల ఈఈ రమణారెడ్డి తెలిపారు.నంద్యాలలోని సెక్షన్లు, కాలనీల వారిగా ఫ్యూజ్ ఆఫ్ కాల్, ఏఈల సెల్ నంబర్ల వివరాలను వివరించారు.

డి1 సబ్ స్టేషన్..

మూలమఠం, భీమవరం, హరిజనవాడ, టీటీడీ రోడ్డు, బాలాజీ కాంప్లెక్స్, రామనాథరెడ్డినగర్, సంజీవనగర్, ఆర్టీసీ బస్టాండ్, రెడ్డిచావిడి, రోజాకుంట, నడిగడ్డ, గాంధీచౌక్, అమ్మవారిశాల, జగజ్జననీనగర్, పప్పులబట్టి బజార్, అరుంధతీ నగర్, పీవీ నగర్, బైర్మల్ స్ట్రీట్, బసవన్న గురి ఏరియా తదితర ప్రాంతాల వినియోగదారులు ఫ్యూజ్‌ఆఫ్ కాల్ 08514–242918, ఏఈ సెల్ : 9440813396 ఫిర్యాదు చేయాలన్నారు.

డి2 సబ్ స్టేషన్..

పద్మావతినగర్, పాలిటెక్నిక్ కాలేజీ, గిరిన్నాథ్ సెంటర్, టెక్కె, భరతమాత టెంపుల్, ఎస్‌బీఐ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, లలితానగర్, ఎన్‌బీటీ నగర్, నూనెపల్లె, విజయ డెయిరీ, గెలివి మిల్, బృందావన్ కాలనీ, జర్నలిస్టు కాలనీ, ఆర్‌ఎఫ్ రోడ్డు, గూడ్‌షెడ్డు, విజయబాను కాటన్ మిల్లు, నర్సు క్వార్టర్స్, వాసవీ స్కూల్, సాదిక్‌నగర్, దేవనగర్, సాయిబాబానగర్, టీచర్స్ కాలనీ, నౌమాన్‌నగర్, వీసీ కాలనీ, గ్రీన్‌సిటీ, ప్రభుత్వాసుపత్రి, డీఎస్పీ కార్యాలయం ఏరియాల్లోని వినియోగ దారులు ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్.08514–242108, ఏఈ సెల్ : 9440813397 నంప్రదించాలని కోరారు.

డి3 సబ్ స్టేషన్..

జ్ఞానాపురం, హనీఫ్‌నగర్, డేనియల్‌పురం, ఎంఎస్‌నగర్, మూలసాగరం, బొగ్గులైన్, బొమ్మలసత్రం, ఘట్టాల్‌నగర్, క్రాంతినగర్, నందమూరినగర్, వైఎస్ నగర్, ఆర్‌డీఓ కార్యాలయం, గాంధీనగర్, పొగాకు కంపెనీ ఏరియా, చామకాల్వ, సలీంనగర్ తదితర ఏరియాల వినియోగదారులు ఫ్యూజ్ ఆఫ్ కాల్ నెం .08514–222533, ఏఈ సెల్: 9440813399 ఫిర్యాదు చేయాలన్నారు. సెక్షన్ల సిబ్బంది, ఏఈలు స్పందించని పక్షంలో డీఈఈలు సెల్ : 9440813342, 9440813347కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.







ముకుందాపురం వద్ద కళకళలాడుతున్న మొక్కజొన్న పైరు,నర్సాపురం సమీపంలో ఏపుగా పెరుగుతున్న పత్తి పంట,రుద్రవరం వద్ద పచ్చి మిరపలో కలుపు నివారణకు సేద్యం చేస్తున్న దృశ్యం

పంటలు కళ కళ

- వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు
- రెండు రోజుల నుంచి తేలికపాటి వర్షాలు
- పచ్చదనం పులుముకున్న పైర్లు

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటలు కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు నెల రోజుల ముందే రుద్రవరం, రెడ్డిపల్లె, ఆర్.నాగులవరం, నర్సాపురం, ఆలమూరు, టీ.లింగందిన్నె, హరినగరం, తండా, చిత్రేనిపల్లె, ముకుందాపురం తదితర గ్రామాల పరిధిలోని రైతులు 300 ఎకరాల్లో పచ్చిమిరప, 200 ఎకరాల్లో మొక్కజొన్న, 60 ఎకరాల్లో పత్తి పంటలు సాగు చేశారు. అప్పట్లో ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ బోర్ల ద్వారా నీటి తడులు అందజేసి పంటలను కాపాడుకున్నారు. వాటికి తోడు రెండు మూడురోజుల నుంచి వాతవరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. చల్లటి గాలులు వీస్తూ తేలిక పాటి వర్షాలు కురుస్తున్నాయి. దీంతోపంటలకు ఊపిరి పోసినట్లయ్యింది. ఇక పంటలకు ఎలాంటి ఢోకాలేదన్న ధీమా రైతుల్లో నెలకొంది. అలాగే ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయ అందడంతో రైతులు సాగు చేసిన పంటలకు ఎరువులు చల్లుతూ, కలుపు మొక్కల నివారణకు సేద్యాలు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు.



